# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 154 | శుక్రవారం 06, ఫిబ్రవరి 2026 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com




## వ్యవసాయం దండుగ కాదు.. పండుగ చేసి చూపిస్తాం..!

**రైతులకు బోనస్‌తో**
**సాగుకు భరోసా**
**రుణమాఫీతో**
**25 లక్షల మందికి లాభం**
**మహిళలకు పాలపిట్ట**
**చీరలు, వడ్డీలేని రుణాలు**
**25 లక్షల ఇందిరమ్మ**
**ఇళ్లతో పేదలకు గూడు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనలో కొత్త అధ్యాయం మొదలైందని, ఇది కేవలం అధికార మార్పిడి కాదని, పేదవాడి ఆకాంక్షల ప్రతిరూపమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. గత పదేళ్ల కాలంలో రాష్ట్రం ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరిస్తూ, అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఆయన వివరించారు. ముఖ్యంగా రైతులకు సాగుపై నమ్మకం కలిగించడం , మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా ..మిగతా 3లో





## రెండేళ్లలో కేసీఆరే సీఎం

**గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల**
**ప్రచారంలో పాల్గొన్న హరీశ్ రావు**
**మనల్ని బాగా చూసుకునే వారికి**
**ఓటు వేయాలని పిలుపు**
**ధైర్యం ఉంటే అభివృద్ధిలో**
**కేసీఆర్‌తో పోటీ పడాలని**
**ముఖ్యమంత్రికి సవాల్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజ్ఞాపూర్‌లో మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు పర్యటించారు. అక్కడ పార్టీ శ్రేణులు నిర్వహించిన భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన అభివృద్ధిని, ..మిగతా 2లో




## గ్రూప్ 1.. లైన్ క్లియర్

**ప్రభుత్వం, TGPSCకి**
**తెలంగాణ హైకోర్టులో ఊరట**
**సింగిల్ బెంచ్ తీర్పును**
**కొట్టివేసిన డివిజన్ బెంచ్**
**గ్రూప్-1 నియామకాలు**
**సక్రమమేనని హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఊరట లభించింది. గ్రూప్1 నియామకాలపై హైకోర్టు బెంచ్ కీలక తీర్పు వెల్లడించింది. సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేసింది సీజే ధర్మాసనం. గ్రూప్ 1 జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ ..మిగతా 2లో

## వెలమలపై విషం కక్కిన సీఎం

**ముఖ్యమంత్రిగా ఉండి**
**తన మర్యాదలను**
**అతిక్రమిస్తున్నారు**
**రాజకీయంగా ఎదుర్కొనే**
**దమ్ములేకే ఇదంతా**
**తెలంగాణ జాగృతి**
**అధ్యక్షురాలు కవిత**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

సీఎం హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి అన్ని మర్యాదలను అతిక్రమించి వ్యవహరిస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. వెలమజాతిని టార్గెట్ చేస్తూ నోటికి వచ్చినట్లు మాట్లాడారని మండిపడ్డారు. గురువారం జూబ్లీహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. సీఎంగా ప్రమాణం చేసినప్పుడు ఏ బేధ భావం లేకుండా అందరినీ గౌరవిస్తానని రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన రేవంత్ రెడ్డి.. ..మిగతా 3లో

## హైదరాబాద్ వేదికగా ప్రపంచ స్థాయి వైద్య విప్లవం..

50 దేశాల ప్రతినిధులతో
హైదరాబాద్‌లో మెగా సదస్సు
AI, ఆటోమేషన్‌తో బయాలజీలో కొత్త విప్లవం
గ్లోబల్ ఫార్మా దిగ్గజాల
సీఎస్‌వోలు, శాస్త్రవేత్తల కీలక ప్రసంగాలు
హెల్త్‌కేర్ హబ్‌గా హైదరాబాద్‌కు
అంతర్జాతీయ గుర్తింపు

02




## మహాత్మా గాంధీ ఏ పాపం చేశారూ..?

**ఉపాధి పథకంలో ఆయన పేరు తొలగించాల్సిన అవసరం ఏంటీ.?**
**ఆ పథకాన్ని తిరిగి తెచ్చే వరకు పోరాటం**
**బలమైన బ్రిటిష్ పాలకులు కూడా గాంధీని ముట్టుకోలేకపోయారు**
**దేశానికి చెందిన మతతత్వ శక్తులు ఆయన్ని కాల్చి చంపాయి**
**చెన్నై బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

మహాత్మా గాంధీ ఏం పాపం చేశారని ఉపాధి హామీ పథకం నుంచి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తొలగించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రశ్నించారు. గురువారం సాయంత్రం చెన్నై నగరంలో ఉపాధి హామీ పథకం నిబంధనలు మార్పు, ఉపాధి పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్ర అనంతరం ..మిగతా 3లో



## తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలి

**ఏపీలో ఎన్నో విమానాశ్రయాలు ఉన్నా**
**తెలంగాణలో ఎందుకు లేవని ప్రశ్న**
**కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ**
**బంగారు బాతు అయిందని విమర్శ**
**దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా**
**తెలంగాణ నుంచే వెళుతున్నాయని ఆగ్రహం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణను రక్షించుకోవాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇన్నాళ్లు తెలంగాణలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలేనని, ఏపీలో విమానాశ్రయాలు ఉన్నాయి కానీ తెలంగాణలో ఎందుకు లేవని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్న ..మిగతా 2లో

## నీకు చేతకాదని ఒప్పుకో.. నేను రంగంలోకి దిగుతా

గ్రామ పంచాయతీలకు
కేంద్రం రూ.259 కోట్లు విడుదల చేసిందని వెల్లడి
కేంద్రం నుంచి వందల కోట్ల
రూపాయల నిధులు తెచ్చామన్న బండి సంజయ్
బీజేపీని గెలిపిస్తే మినీ స్టేడియం నిర్మిస్తామని హామీ



02


## ఏడుపాయల మహాజాతర..



**ఫిబ్రవరి 15–17 వరకు మూడు**
**రోజుల మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు**
**పుణ్యస్నానాలు, బండ్ల ఉత్సవం,**
**రథోత్సవం ప్రధాన ఆకర్షణలు**
**లక్షలాది భక్తుల రాక**
**బస్సులు, నీటి విడుదల, పోలీస్**
**బందోబస్తుతో ప్రత్యేక ఏర్పాట్లు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్రంలోనే మేడారం జాతర తర్వాత అత్యంత వైభవంగా జరిగే రెండో అతిపెద్ద జాతరగా గుర్తింపు పొందిన మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గా భవాని మాత మహాజాతరకు ముహూర్తం ఖరారైంది. ఏడు పాయల మధ్య వెలిసిన ..మిగతా 2లో



# గ్రూప్ 1.. లైన్ క్లియర్

**మొదటిపేజీ తరువాయి**

గతంలో సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. మెయిన్స్ జవాబు పత్రాలు మళ్లీ మూల్యాంకనం చేయాలని సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చారు. అయితే సింగిల్ జడ్జి ఆదేశాలపై టీజీపీఎస్సీ, ఎంపికైన అభ్యర్థులు అప్పీల్ చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈమేరకు తీర్పు వెలువరించింది. తుది తీర్పునకు లోబడి నియామకాలు చేపట్టవచ్చని గతంలో ఉత్తర్వులు ఇచ్చింది సీజే బెంచ్.. ఇప్పటికే 562 మందికి తెలంగాణ ప్రభుత్వం నియామక పత్రాలు అందజేసింది. ప్రభుత్వం, TGPSCకి, ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. అప్పీల్ పిటిషన్లను అనుమతించిన హైకోర్టు.. సింగిల్ బెంచ్ తీర్పును కొట్టివేసిన డివిజన్ బెంచ్.. గ్రూప్1 నియామకాలు సక్రమమేనని హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చింది. గ్రూప్1 పరీక్ష పారదర్శకంగానే జరిగింది.. పరీక్షలో అవకతవకలు జరిగినట్లు ఆధారాలు లేవు అని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది.

టీజీపీఎస్సీ 2024 లో గ్రూప్ 1 పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. పరీక్షలో అవకతవకలు జరిగాయని హైకోర్టును ఆశ్రయించారు సెలెక్ట్ కాని అభ్యర్థులు. విచారణ అనంతరం సెలెక్షన్ లిస్టును రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించింది హైకోర్టు డివిజన్ బెంచ్. మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని పరీక్షలు రద్దు చేయాలని కొందరు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2023 అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరిగిన గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలకు 21 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆ పరీక్షల ఫలితాలను టీజీపీఎస్సీ గతేడాది మార్చి 10న విడుదల చేసింది. ఈ ఫలితాల్లో అభ్యర్థులకు వచ్చిన మార్కులపై అనేక అనుమానాలు తలెత్తాయి. పరీక్షల్లో జెల్ పెన్నులు వాడటం, కోఠి మహిళా కాలేజీలో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది సెలెక్ట్ కావడం, తెలుగు మీడియం అభ్యర్థులు తక్కువగా ఎంపిక కావడం, కేవలం 2 సెంటర్ల నుంచే టాపర్లు ఉండటం తదితర అంశాలపై పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. పరీక్షలు రద్దు చేయొద్దని కోర్టులో పిటిషన్ వేసిన ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు. ఇప్పటికే ఇరువురి పిటిషన్లపై వాదనలు విన్న న్యాయస్థానం ఈ రోజు తీర్పు వెల్లడించింది

## తెలంగాణను రక్షించుకోవాలంటే
# బీజేపీకి ఓటు వేయాలి



**మొదటిపేజీ తరువాయి**

బీఆర్ఎస్ పార్టీ ఏం చేసిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు అయిందని విమర్శించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా, తెలంగాణ నుంచే డబ్బులు వెళుతున్నాయని ఆరోపించారు. తెలంగాణను కాపాడుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు ఉన్న విషయం తెలిసిందే.



# రెండేళ్లలో కేసీఆరే సీఎం

**మొదటిపేజీ తరువాయి**

రేవంత్‌రెడ్డి వైఫల్యాలను ఎండగట్టారు. 'గజ్వేల్‌లో ఎన్నికలు వచ్చాయి. మనకు అన్నం పెట్టిన వాళ్లకు, మనకు పని చేసిన వాళ్లకు, మనల్ని మంచిగా చూసుకున్న వాళ్లకే ఓటేయాలి. సద్ది తిన్న రేవు తలవాలి' అని చెప్పారు.

కేసీఆర్ గజ్వేల్ అభివృద్ధి ప్రధాత అని హరీష్‌రావు అన్నారు. గజ్వేల్‌లో బీఆర్ఎస్‌ను మళ్ళీ గెలిపించుకోవాలని చెప్పారు. 'కేసీఆర్ రాకముందు గజ్వేల్ ఎట్లుండే..? ఇప్పుడు ఎట్లుంది..? ఆలోచించండి. ప్రజ్ఞాపూర్‌గజ్వేల్ రోడ్డు అప్పుడు ఎట్లుండే..? ఆ రోజు గజ్వేల్ దవాఖాన పందులకు నిలయంగా ఉండేది. ఈ రోజు 250 పడకల ఆసుపత్రి తెచ్చి పేదలకు కార్పొరేట్ వైద్యం అందించింది కేసీఆర్. గజ్వేల్‌కు ఆర్డీవో ఆఫీస్, రైలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఊర చెరువు, పాండవుల చెరువు సుందరీకరణ చేసింది కేసీఆర్ కాదా..? కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేదింటి ఆడబిడ్డ పెళ్లికి 1,00,116 అందించి మేనమామలా ఆదుకున్నది కేసీఆర్. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవిస్తే కేసీఆర్ కిట్‌తోపాటు 13,000 అందించిన ఘనత కేసీఆర్‌ది' అన్నారు.

'మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు, బీసీ, ఎస్సీ, మైనార్టీ బిడ్డల కోసం గురుకులాలు స్థాపించి చదువుల విప్లవం తెచ్చింది కేసీఆర్. ఒకప్పుడు గజ్వేల్‌లో మూడు రోజులకోసారి నీళ్లు వచ్చే పరిస్థితి పోయి.. ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీళ్లు అందించారు. బిందెలు పట్టే కష్టం లేకుండా చేసి, మహిళల కష్టాలు తీర్చింది కేసీఆర్. రైతుబంధు ఎందుకు వేయలేదు అంటే ఎలక్షన్ అయ్యాక ఇస్తా అంటున్నాడు రేవంత్. కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ 11 సార్లు రైతుబంధు ఆపలేదు. ఇంటింటికీ బియ్యం, మందులు పంపారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక ఇప్పటికీ రెండు రైతుబంధులు ఎగ్గొట్టిండు. ఇది మూడోది. ఎగ్గొట్టిన రెండు, ఇప్పుడు రావాల్సిన ఒకటి కలిపి మూడు రైతుబంధులు వెంటనే వేయాలని డిమాండ్ చేస్తున్నాం. కావాలంటే మాకు అభ్యంతరం లేదని ఎలక్షన్ కమిషన్‌కు మేమే లేఖ ఇస్తాం. 11వ తేదీలోగా రైతుబంధు వేయకపోతే రైతులు నిన్ను చీల్చి చెండాడుతారు' అని హరీష్‌రావు హెచ్చరించారు.

'త్యాగాలతో, ఆమరణ దీక్షతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు, తెలంగాణ జాతిపిత కేసీఆర్. రేవంత్ రెడ్డి నోరు తెరిస్తే చాలు బూతులు మాట్లాడే బూతుల పిత. ఎంతో కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను రేవంత్ రెడ్డి ఆగమాగం చేస్తుండు. సర్వనాశనం చేసిండు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి.. పెన్షన్ అడిగితే లాగుల తొండలు వదులుతా, హామీలు అడిగితే పేగులు మెడలో వేసుకుంటా అంటాడు. హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లి వచ్చానని చెప్పుకునే రేవంత్ రెడ్డి బుద్ధి.. కుక్క తోక వంకర అన్నట్టే ఉంది. గతంలో రూ.

200 ఉన్న పెన్షన్‌ను రూ.2000 చేసింది కేసీఆర్. రేవంత్ రెడ్డి రూ.4000 ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి సగం కాలం గడిచినా ఒక్క రూపాయి పెంచలేదు. ఇప్పటివరకు ఒక్కో అవ్వ తాతకు రూ.52,000 ప్రభుత్వం బాకీ పడింది' అని చెప్పారు. 'మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్నాడు. ఎవరికైనా వచ్చిందా..? ఫ్రీ బస్సు అని మగోళ్లకు డబుల్ టికెట్ కొట్టి, ఆడవాళ్లకు తిప్పలు పెట్టారు. పువ్వు గుర్తు వాళ్ళు ఎన్నడైనా ఒక్క రూపాయి పని చేశారా..? అక్షింతలు పంచడం తప్ప ఏమైనా చేశారా..? యాదాద్రి నరసింహ స్వామి గుడి కట్టింది కేసీఆర్. గజ్వేల్ వెంకటేశ్వర స్వామి గుడి, రామాలయం, శివాలయం అద్భుతంగా కట్టించింది కేసీఆర్. పనిచేసే వాళ్లకు ఓటేద్దామా..? అక్షింతలు వేసే వాళ్లకు ఓటేద్దామా..? కేసీఆర్ ముస్లిం మైనార్టీ పిల్లల చదువు కోసం ఆలోచించి రెసిడెన్షియల్ స్కూల్స్ పెట్టారు. షాదీ ముబారక్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి వచ్చాక మైనార్టీల కోసం ఒక్క రూపాయి పనిచేశారా..? ఎరువు బస్తాలు ఇచ్చే తెలివి లేదు. చేతగాని దద్దమ్మ రేవంత్ రెడ్డి' అని హరీష్‌రావు మండిపడ్డారు.

'రేవంత్‌రెడ్డీ నువ్వు కేసీఆర్‌ని తిడతావా..? నీ మొఖానికి పండిన వడ్లు కొనే తెలివిలేదు. దళితబంధు బంద్ పెట్టి రాష్ట్రాన్ని ఆగమాగం చేస్తున్నావు. మన తెలంగాణను కాపాడుకోవాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటేయాలి. ఇప్పుడు గెలిచిన కౌన్సిలర్లు ఐదేళ్లు ఉంటారు. రెండేళ్లలో వచ్చేది మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వమే. ప్రజ్ఞాపూర్ గౌరవం నిలబడాలంటే బీఆర్ఎస్ గెలవాలి' అని చెప్పారు.




# హైదరాబాద్ వేదికగా ప్రపంచ స్థాయి వైద్య విప్లవం..

- **50 దేశాల ప్రతినిధులతో హైదరాబాద్‌లో మెగా సదస్సు**
- **AI, ఆటోమేషన్‌తో బయాలజీలో కొత్త విప్లవం**
- **గ్లోబల్ ఫార్మా దిగ్గజాల సీఎస్‌వోలు, శాస్త్రవేత్తల కీలక ప్రసంగాలు**
- **హెల్త్‌కేర్ హబ్‌గా హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**




లైఫ్ సైన్సెస్ , హెల్త్‌కేర్ రంగాల్లో ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన సదస్సుగా గుర్తింపు పొందిన 'బయో ఏషియా' తన 23వ ఎడిషన్‌తో హైదరాబాద్‌లో సందడి చేసేందుకు సిద్ధమైంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సు, ఈ ఏడాది "టెక్‌బయో అన్‌లీష్డ్: ఏఐ, ఆటోమేషన్ - బయాలజీ రివల్యూషన్" అనే శక్తివంతమైన ఇతివృత్తంతో జరగనుంది. ఫిబ్రవరి 17న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఈ మహా సదస్సును ప్రారంభించనున్నారు. కేవలం రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 50 దేశాలకు చెందిన సుమారు మూడు వేల మంది ప్రతినిధులు పాల్గొని, వైద్య , బయోటెక్నాలజీ రంగాల్లో రాబోయే విప్లవాత్మక మార్పులపై మేధోమథనం చేయనున్నారు.

ఈ సారి సదస్సు ప్రధానంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (AI), ఆటోమేషన్‌ద్వారా జీవశాస్త్రంలో వస్తున్న మార్పులపై దృష్టి సారించింది. అమ్జెన్, సానోఫీ, ఎలీ లిల్లీ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల అధిపతులు ఈ వేదికపై తమ ఆలోచనలను పంచుకోనున్నారు. ముఖ్యంగా క్యాన్సర్ జీన్ థెరపీ నిపుణులు ప్రొఫెసర్ బ్రూస్ ఎల్. లెవిన్, అమ్జెన్ సీఎస్‌వో డాక్టర్ హోవర్డ్ వై. చాంగ్ వంటి అంతర్జాతీయ స్థాయి మేధావులు ఈ సదస్సులో కీలక ప్రసంగాలు చేయనున్నారు. కేవలం విదేశీ ప్రతినిధులే కాకుండా, భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్ర సలహాదారు ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్, ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్.సోమనాథ్ వంటి దేశీయ నిపుణులు కూడా పాల్గొనడం ఈ సదస్సు ప్రాధాన్యతను చాటిచెబుతోంది.

హైదరాబాద్‌ను గ్లోబల్ హెల్త్‌కేర్ హబ్‌గా మార్చే దిశగా ఈ సదస్సు ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. సదస్సులో భాగంగా నిర్వహించబోయే ప్రత్యేక సీఈఓ కాన్‌క్లేవ్‌లో డాక్టర్ రెడ్డీస్, బయోకాన్, సిప్లా వంటి దేశీయ ఫార్మా దిగ్గజాలు, నోవార్టిస్, ఆస్ట్రాజెనెకా వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో కలిసి సెల్ & జీన్ థెరపీలు, ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీ వంటి అత్యాధునిక అంశాలపై చర్చించనున్నారు. ఈ చర్చల ద్వారా కొత్త రకమైన మందుల ఆవిష్కరణలు, మెడికల్ టెక్నాలజీలో పురోగతి ,గ్లోబల్ బయో ఎకానమీని బలోపేతం చేసే మార్గాలను అన్వేషించనున్నారు. మొత్తానికి, బయో ఏషియా 2026 సదస్సు తెలంగాణను ప్రపంచ లైఫ్ సైన్సెస్ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా నిలబెట్టడమే కాకుండా, మానవాళి ఆరోగ్య సంరక్షణలో సాంకేతికత పోషించబోయే కీలక పాత్రను ప్రపంచానికి పరిచయం చేయనుంది.

# ఏడుపాయల మహాజాతర..

**మొదటిపేజీ తరువాయి**

ఆ వనదుర్గమ్మ సాక్షిగా, ఈ ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం , ఆలయ కమిటీ సర్వ సిద్ధం చేస్తోంది. మంజీరా నది ఏడు పాయలుగా విడిపోయి, అమ్మవారి పాదాల చెంత నుంచి ప్రవహించే ఈ పవిత్ర క్షేత్రానికి ఏటా కోట్లాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఈ ఏడాది కూడా జాతరలో భాగంగా మొదటి రోజు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు మంజీరా నది పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి, అమ్మవారిని దర్శించుకోనున్నారు. రెండో రోజైన ఫిబ్రవరి 16న జాతరలోనే ప్రధాన ఘట్టమైన 'బండ్ల ఉత్సవం' అత్యంత కోలాహలంగా సాగుతుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తమ ఎడ్లబండ్లను రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదర్శనగా తిరుగుతూ మొక్కులు తీర్చుకుంటారు. ఆఖరి రోజైన ఫిబ్రవరి 17న రథోత్సవంతో ఈ మహా క్రతువు ముగుస్తుంది.

ఈ జాతరకు కేవలం మెదక్ జిల్లా నుంచే కాకుండా సంగారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాలతో పాటు గ్రేటర్ హైదరాబాద్ , పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల నుండి కూడా సుమారు 15 లక్షల మందికి పైగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ భారీ జనసమూహానికి అనుగుణంగా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. భక్తులకు స్నానాల సమయంలో ఇబ్బంది కలగకుండా మంజీరా నదిలోకి నీటిని విడుదల చేయడంతో పాటు, ఘాట్ రోడ్ల మరమ్మతులు, బారికేడ్ల నిర్మాణం , తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించారు. రవాణా సౌకర్యం కోసం తెలంగాణ ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులను నడపనుంది. భక్తుల భద్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, భారీ పోలీస్ బందోబస్తును కూడా మోహరిస్తున్నారు. వనదుర్గమ్మ ఆశీస్సుల కోసం వచ్చే భక్తులందరికీ అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, ఈ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేలా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు జరుగుతున్నాయి.



# నీకు చేతకాదని ఒప్పుకో.. నేను రంగంలోకి దిగుతా

- **గ్రామ పంచాయతీలకు కేంద్రం రూ.259 కోట్లు విడుదల చేసిందని వెల్లడి**
- **కేంద్రం నుంచి వందల కోట్ల రూపాయల నిధులు తెచ్చామన్న బండి సంజయ్**
- **బీజేపీని గెలిపిస్తే మినీ స్టేడియం నిర్మిస్తామని హామీ**

మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే మొదటి విడతగా తెలంగాణకు రూ.500 కోట్లు తీసుకొస్తామని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. హుజూరాబాద్‌లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ.259 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

గత కొన్నేళ్లుగా హుజూరాబాద్ అభివృద్ధి చెందలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. కేంద్రం నుంచి అభివృద్ధి పనుల కోసం వందల కోట్ల రూపాయలు తీసుకొచ్చామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని పరికరాలను తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అవసరమైన సిబ్బందిని నియమించడం లేదని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక హుజూరాబాద్ అభివృద్ధికి పైసా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే మినీ స్టేడియం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అన్ని రకాల పన్నులు పెంచుతారని ఆరోపించారు.

రాబోయే బడ్జెట్‌లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై బండి సంజయ్ స్పందించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఇతర హామీల్లాగే ఇదీ ఉందని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మాత్రమే తెలంగాణకు ఇళ్లు వచ్చాయని అన్నారు. కేసీఆర్‌కు, ఆయన కుటుంబానికి చర్లపల్లి జైలులో రెండు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని, కానీ ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి కూడా కదిలించలేకపోయారని అన్నారు.

**కిషన్ రెడ్డి, నేను కలిసి నిధులు తీసుకొచ్చాం**

తెలంగాణలోని గ్రామపంచాయతీలకు కేంద్రం నుంచి రూ.259 కోట్ల నిధులు తీసుకువచ్చామని బండి సంజయ్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కిషన్ రెడ్డి, తాను నిరంతరం సంప్రదింపులు జరిపి ఈ నిధులు తెచ్చామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కేవలం ప్రకటనలతో సరిపెట్టదని, కిందిస్థాయి వరకు నిధులు చేరుతాయని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. నిధులు ఇంతటితో ఆగవని, దశలవారీగా వస్తూనే ఉంటాయని అన్నారు. అభివృద్ధి చేసే పార్టీలకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు.



# వ్యవసాయం దండుగ కాదు.. పండుగ చేసి చూపిస్తాం..!

మొదటిపేజీ తరువాయి

అని ఆయన స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో వరి పండించడంపై ఆంక్షలు విధించి రైతులను ఆందోళనకు గురిచేస్తే, ప్రస్తుత ఇందిరమ్మ రాజ్యం సన్న వడ్లు పండించే ప్రతి రైతుకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఈ ఒక్క నిర్ణయం వల్ల దేశంలోనే అత్యధికంగా వరి పండించిన రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే నిధులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుండటం గతంలో ఎన్నడూ చూడని పరిణామం. రుణమాఫీ పథకం ద్వారా ఇప్పటికే 25 లక్షల మందికి పైగా రైతులకు రూ.21,000 కోట్ల మేర రుణ విముక్తి కలిగించామని, రాబోయే రోజుల్లో మిగిలిన వారికి కూడా ఈ ప్రయోజనం చేకూరుస్తామని సీఎం హామీ ఇచ్చారు. రైతు భరోసా నిధుల విడుదల ప్రక్రియ కూడా వేగవంతమైందని, అన్నదాతను రాజును చేయడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

మహిళా సంక్షేమం విషయానికి వస్తే, గత ప్రభుత్వం నాణ్యత లేని చీరలను పంపిణీ చేసి మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. దానికి భిన్నంగా, నేతన్నలకు ఉపాధి కల్పిస్తూ నాణ్యమైన 'పాలపిట్ట' చీరలను నేయించి ఆడబిడ్డలకు సారెగా అందజేస్తున్నామని చెప్పారు. కేవలం చీరలకే పరిమితం కాకుండా, మహిళా సమాఖ్యల ద్వారా లక్షలాది మందికి వడ్డీ లేని రుణాలు అందిస్తూ వారిని పారిశ్రామికవేత్తలుగా మారుస్తున్నామని తెలిపారు. ఇక పేదవాడి సొంతింటి కల విషయానికి వస్తే, 25 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా



ప్రతి పేద కుటుంబానికి గూడు కల్పించే యజ్ఞం మొదలైందని, స్థలం ఉన్న వారికి రూ.5 లక్షల సహాయం, స్థలం లేని వారికి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇస్తామని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ మార్పు కేవలం ఆరంభమేనని, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో మరింత వేగంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# వెలమలపై విషం కక్కిన సీఎం

మొదటిపేజీ తరువాయి

ఇప్పుడు అవన్నీ మరిచి పోయి ఒక జాతిని టార్గెట్ చేయటం సరికాదన్నారు. రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేకనే ఇలా ఒక జాతిపై విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు. సీఎం తప్పకుండా ఇలాంటి వైఖరిని మార్చుకోవాలన్నారు.

సంజయ్ కాంగ్రెస్ లో చేరిక ముమ్మాటికి నిజం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన విషయం ముమ్మాటికీ నిజమని కవిత అన్నారు. సీఎం ఆధ్వర్యంలోనే ఆయన కాంగ్రెస్‌లో చేరారన్న ఆమె ఆ విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్ కండువా కప్పుకున్న తర్వాత సంజయ్... గాంధీభవన్‌లో అధికారిక సమావేశాలకు హాజరవుతున్నారని చెప్పారు. అలాగే జగిత్యాలలో మున్సిపల్ అభ్యర్థులకు 30 మందికి కాంగ్రెస్ బీ ఫామ్‌లు కూడా ఇచ్చారని చెప్పారు. అలాంటి వ్యక్తికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇవ్వటం సరికాదన్నారు. సంజయ్ కి నీతి, నిజాయితీ ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరంగా ఉన్న హక్కులను ఒక్కొక్కటిగా తుంగలో తొక్కటం, భవిష్యత్ తరాలకు మంచిది కాదన్నారు. వెంటనే స్పీకర్ తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

**న్యాయవాదులకే రక్షణ లేదు...**

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో హత్యకు గురైన న్యాయవాది స్వప్న కుటుంబ సభ్యులను పరామర్శించిన కవిత.. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లాయర్ స్వప్న ఉదంతం బాధ కలిగించిందన్నారు. తనకు ప్రాణహాని ఉందని స్వప్న ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. కంప్లైంట్ ఇచ్చినప్పుడే పోలీసులు స్పందించి ఉంటే ఇంత దారుణం జరిగేది కాదన్నారు. దీనిపై పోలీసులు, ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. హైదరాబాద్‌కు కూత వేటు దూరంలోనే ఈ సంఘటన జరగడం పోలీసుల వైఫల్యం, ప్రభుత్వ అసమర్థ పాలనకు అద్దం పడుతుందన్నారు. గతంలో న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్ పొటెక్షన్ యాక్ట్ బిల్లుకు గతంలో సవరణలు చేశారని చెప్పారు. కానీ రెండేళ్లుగా ఆ బిల్లును పెండింగ్ లో పెట్టారన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఆ బిల్లును పాస్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించి... ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరపాలన్నారు. మూడు నెలలలోపు నిందితులకు శిక్ష పడే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నేరస్తులకు పోలీసులంటే భయం లేని పరిస్థితి నెలకొందని కవిత చెప్పారు. గన్ తో బెదిరించి డబ్బులు తీసుకెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ లో మహిళలపై నేరాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా దృష్టి పెట్టాలి. పోలీసులకు సీరియస్ గా ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది హైదరాబాద్ లో జరిగిన అగ్నిప్రమాదాల్లో 22 మంది చనిపోయారని చెప్పారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి కనీసం ఒక్కరి కుటుంబాన్ని కూడా పరామర్శించలేదని విమర్శించారు. మున్సిపల్, హోం, విద్య శాఖ ఇలా చాలా శాఖలు సీఎం వద్దే ఉండటంతో ఆయన ఆయా శాఖల పురోగతిపై దృష్టిసారించలేకపోతున్నారని చెప్పారు.



# మహాత్మా గాంధీ ఏ పాపం చేశారూ..?

మొదటిపేజీ తరువాయి

ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఉపాధి హామీ పథకంలో మార్పులు చేసి ఆ పథకం కనిపించకుండా చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది, ఈ చట్టంలో మహాత్మా గాంధీని పేరు తొలగించడమే కాదు వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ గ్యారంటీ కల్పించాలన్న ఆత్మను సైతం తొలగించారని డిప్యూటీ సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని కోట్లాదిమంది వ్యవసాయ కార్మికులు ఏం పాపం చేశారని ఉపాధి హామీ పథకంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మార్పులు చేసిందని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. ప్రతి వ్యవసాయ సీజన్లో 50 పైసల కూలీ ధరల పెరుగుదల కోసం దేశవ్యాప్తంగా ఎన్నో ఆందోళనలు, పోలీసు లాఠీచార్జీలు, రక్తపాతం జరిగేవి అని డిప్యూటీ సీఎం వివరించారు.

ఈ దారుణమైన పరిస్థితులను పారద్రోలాలన్న మానవీయకోణంతో యూపీఏ చైర్పర్సన్ సోనియా గాంధీ, నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో దేశంలోని కోట్లాదిమంది వ్యవసాయ కార్మికుల కోసం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని ఈ దేశంలో తీసుకువచ్చారని తెలిపారు. చిన్న రక్తపాతం, ఎలాంటి ఆందోళనలు లేకుండా కూలీలకు 100 రోజుల పని గ్యారంటీ కల్పిస్తూ, ఉపాధి అనేది వ్యవసాయ కార్మికుల హక్కు అని మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. ఈ పథకం దేశంలోని కోట్లాది వ్యవసాయ కార్మికుల జీవితాల్లో ఒక నిశ్శబ్ద విప్లవం అని వర్ణించారు. ఈ గొప్ప పథకం వ్యవసాయ కార్మికుల జీవితాలకు ఓ అర్థం తీసుకువచ్చింది, ఉన్న ఊరిలోనే సంపాదిస్తూ ఆత్మగౌరవంతో వ్యవసాయ కూలీలు జీవించేందుకు మహాత్మా గాంధీ ఉపాధి పథకం తోడ్పడిందని తెలిపారు. ఇంతటి గొప్ప పథకాన్ని కనుమరుగు చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి పథకంలో అనేక మార్పులు తీసుకువచ్చింది, చివరకు దేశ ప్రజలు మహాత్మునిగా పిలుచుకునే గాంధీ పేరును సైతం తొలగించిందని తెలిపారు. ఏ సి సి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ల పిలుపుమేరకు దేశంలోని అన్ని రాష్ట్రాల పిసిసి కమిటీల ఆధ్వర్యంలో దేశంలోని కోట్లాది వ్యవసాయ కార్మికుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం 2005 ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించే వరకు వ్యవసాయ కార్మికుల పక్షాన దేశంలోని కోట్లాది కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు వ్యవసాయ కార్మికుల పక్షాన అలుపెరగని పోరాటం చేస్తాయని స్పష్టం చేశారు. సామాన్యునికి ఇబ్బందులు వచ్చినప్పుడు తమిళనాడు ఎల్లప్పుడూ ముందు వరుసలో నిలబడుతుంది ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం తెచ్చిన కొత్త ఉపాధి చట్టంతో వ్యవసాయ కార్మికుల జీవితాల్లో ఇబ్బందులు మొదలయ్యాయి ఇప్పుడు కూడా తమిళనాడు ముందు వరుసలో నిలబడి వ్యవసాయ కార్మికుల పక్షాన నిలబడటం అభినందనీయం అన్నారు. ఈరోజు చెన్నై నగరంలో జరుగుతున్న భారీ ర్యాలీని చూస్తే తనకు కొన్ని విషయాలు గుర్తుకు వస్తున్నాయని వివరించారు. ఈ దేశ స్వతంత్రం కోసం మహాత్మా గాంధీ 1915లో ఆయన తన న్యాయవాద వృత్తిని వదిలి దేశానికి వచ్చారని గుర్తు చేశారు. అధికారం కోసమో? ఇతర వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆయన ఈ దేశానికి రాలేదని తెలిపారు. తన సహచరులతో కలిసి దేశ స్వాతంత్రం కోసం గొప్ప పోరాటం నిర్వహించాలని పట్టుదలతో న్యాయవాద వృత్తిని వదిలేసి దక్షిణ ఆఫ్రికా నుంచి వచ్చారని తెలిపారు.

దారుణమైన బ్రిటిష్ పాలన నుంచి దేశ ప్రజలను విముక్తి కల్పించడానికి మహాత్మా గాంధీ సహాయ నిరాకరణ, దండి మార్చ్, ఉప్పు సత్యాగ్రహం, సంపూర్ణ స్వరాజ్యం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల్లో ఆయనతోపాటు అనేకమంది సీనియర్ నాయకులు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. వారి అద్భుతమైన, సాహసోపేతమైన పోరాటం మూలంగా మన దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం సిద్ధించడమే కాదు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అధ్యక్షతన అద్భుతమైన రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామని, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఈరోజు భారతదేశ కీర్తిని పొందింది అంటే బలమైన రాజ్యాంగమే కారణమని తెలిపారు.

1915 నుంచి 1947 వరకు మహాత్మా గాంధీ నాయకత్వంలో ఈ దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు జరిగాయి అయినప్పటికీ బలమైన బ్రిటిష్ సామ్రాజ్యం గాంధీజీని ముట్టుకునే సాహసం కూడా చేయలేక పోయిందని తెలిపారు. దురదృష్టం ఏంటంటే స్వాతంత్రం సిద్ధించిన ఆరు నెలల్లోనే మన దేశానికి చెందిన మత శక్తులు మహాత్మా గాంధీని పట్టపగలు తుపాకీ గుళ్ళతో కాల్చి చంపాయి అన్నారు. బలమైన సామ్రాజ్యవాద బ్రిటిష్ ప్రభుత్వం గాంధీని ముట్టుకోలేకపోయింది కానీ మన దేశానికి చెందిన మతవాద శక్తులు మనమంతా మహాత్ముడిగా పిలుచుకునే గాంధీజీనీ చంపేశాయి అన్నారు.

గాంధీజీ మనకు స్వేచ్ఛను ఇచ్చారు, పెరియార్ ఆత్మగౌరవాన్ని ఇచ్చారు, కామరాజు నిజాయితీని ఇచ్చారు, అన్నా దురై మనకు గౌరవాన్ని ఇచ్చారు ఈ వరసత్వానికి తగిన భవిష్యత్తు ను మన బిడ్డలకు ఇవ్వాలి అదే కాంగ్రెస్ లక్ష్యం, నైతిక కర్తవ్యం, చారిత్రాత్మక బాధ్యత అని డిప్యూటీ సీఎం తెలిపారు. సభలో తమిళనాడు పిసిసి అధ్యక్షుడు సెల్వ, ఏ సి సి సెక్రటరీ చోలాంకర్ జి తదితరులు పాల్గొన్నారు.





# శంకర్‌పల్లి మున్సిపల్‌లో కాంగ్రెస్ పార్టీ విస్తృత ప్రచారం

- **కౌన్సిలర్లకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న పొద్దటూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**శంకర్ పల్లి ఫిబ్రవరి 05(ప్రజాస్వరం):**

శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ జోరుగా ముందుకు సాగుతోంది. ఈ ప్రచారంలో పొద్దటూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగించారు. ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రజలతో నేరుగా సంభాషణలు జరిపిననాయకులు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు కోరారు. పార్టీ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, కాంగ్రెస్ పాలనతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని ప్రజల్లో విశ్వాసం కల్పించారు. గ్రామ స్థాయి నుంచి మున్సిపల్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసే దిశగా నాయకులు సమష్టిగా పనిచేయడం విశేషంగా నిలిచింది. పొద్దటూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఐక్యత, అంకితభావం పార్టీ విజయానికి కీలకంగా మారనుందని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీకి లభిస్తున్న అనుకూల స్పందనతో కార్యకర్తల్లో మరింత ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి, మాజీ డిప్యూటీ సర్పంచ్ బండ నర్సింహా, మాజీ సర్పంచ్ కటికె శ్రీనివాస్, వార్డు సభ్యులు ప్రశాంత్, మాజీ వార్డు సభ్యులు కవేలి రామ్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు కవేలి జంగా రెడ్డి, నాయకులు బొల్లారం ప్రశాంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, కవేలి రమణ రెడ్డి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



# పట్టణాల సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యంచేవెళ్ల మాజీ ఎంపి రంజిత్ రెడ్డి

- **శంకర్‌పల్లి మున్సిపాలిటీని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దే బాధ్యత కాంగ్రెస్ పార్టీ-పామేన భీమ్ భరత్**

**శంకర్ పల్లి ఫిబ్రవరి 05(ప్రజాస్వరం):**



శంకర్‌పల్లి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ దూకుడు మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి,కాంగ్రెస్ ఇంచార్జి పామేన భీమ్ భరత్ సంయుక్త ప్రచారం శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ జోరు చూపుతోంది. చేవెళ్ళ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్, చేవెళ్ళ మాజీ ఎంపీ శ్రీ గడ్డం రంజిత్ రెడ్డితో కలిసి శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులలో ఇంటింటా తిరుగుతూ ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, పట్టణ అభివృద్ధిపై పార్టీ దృష్టికోణాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి మాట్లాడుతూ... పట్టణాల సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించే అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను 'చేయి'గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. చేవెళ్ల ఇంచార్జి పామేన భీమ్ భరత్ మాట్లాడుతూ...శంకర్‌పల్లి మున్సిపాలిటీని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోతువల్ తండాలో గ్రామసభ

- **గ్రామ సమస్యల పరిష్కారానికి విస్తృత చర్చ**
- **తొలిసారిగా పోతుగల్ తండా లో గ్రామ సభలు నిర్వహించడంతో ప్రజల్లో ఆనందోత్సవం**
- **తాసిల్దార్ మమ్మద్ అన్వర్, గ్రామ సభకు హాజరైనందుకు పాలకవర్గంలో ఆనందం**
- **పోతుగల్ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,**

**ఫిబ్రవరి 05(ప్రజాస్వరం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని పోతు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలోని పెద్ద తండాలో గురువారం గ్రామసభ సర్పంచ్ పామేన నర్సింలు, ఉపసర్పంచ్ నేరెట్ల సావిత్రి, ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలపై గ్రామ ప్రజలు విస్తృతంగా చర్చించారు. తాగునీటి సమస్య, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, గ్రామాభివృద్ధి కోసం ప్రజల అభిప్రాయాలు ఎంతో కీలకమని గ్రామ సభ ద్వారా వచ్చిన సమస్యలను పరిశీలించి దశలవారీగా పరిక్షించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో తండాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుదలతో పాటు ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తామని అధి



కారులు పేర్కొన్నారు. గ్రామ సభ వేదికగా సమస్యలను నేరుగా తెలియజేయడం వల్ల పరిష్కారాలు వేగవంతమవుతాయని, గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం తప్పని సరిగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోతుగల్ గ్రామపంచాయతీ పాలకవర్గం, రెవెన్యూ, డి శ్వేత గృహ, జి పి ఓ, ఏ ఈ అఖిల,ఎలక్ట్రిసిటీ, ఉపాధి హామీ ఎపిఓ వీరా సింగ్, ఏ ఈ స్వర్ణ, ఏఈఓ గాయత్రి, ఆశ వర్కర్లు, గ్రామ సంఘం అధ్యక్షురాలు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రచారంలో హోరు ప్రజల బ్రహ్మరథం



**తూప్రాన్, ఫిబ్రవరి 5 (ప్రజా స్వరం):**

తూప్రాన్ మున్సిపాలిటి 14వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి పోతరాజు రచన ధనరాజ్ ఇంటింటి ప్రచారం.... బ్రహ్మరథం పట్టిన వార్డు ఓటర్లు... భారీ మెజారిటీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసిన వార్డు ఇంచార్జ్ మల్కాపూర్ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ధీమా. తూప్రాన్ మున్సిపాలిటీలోని 14వ వార్డులో గురువారం వార్డు ఇన్చార్జ్ మల్కాపూర్ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో అభ్యర్థి పోతరాజు రచనా ధనరాజ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తూప్రాన్ మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధిని ప్రతి ఓటరుకు వివరించారు. అలాగే ప్రతి ఇంటికి కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి హామీలతో గద్దెనెక్కి గతంలో ఉన్న సంక్షేమ పథకాలకు తిలోదకాలు ఇచ్చిందన్నారు. గడచిన రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి లు బలపరిచిన 14వ వార్డు అభ్యర్థి పోతరాజు రచనా ధనరాజును భారీ మెజారిటీతో గెలిపించాలని వార్డు ఓటర్లను ఇన్చార్జి ఆంజనేయులు గౌడ్ శివంపేట మాజీ ఎంపీపీ హరికృష్ణ లు కోరారు. కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు శ్రీకాంత్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం కాలువ ద్వారా బీఆర్ఎస్ లక్షల కోట్లు దోచుకుంది

- ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు 420 హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసింది
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**రామాయంపేట, ఫిబ్రవరి 05 (ప్రజా స్వరం):**



రామాయంపేట మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రఘునందన్ రావు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు, రామాయంపేట బైపాస్ నుండి వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి బహిరంగ సభలో పాల్గొన్నారు, రామయంపేట పట్టణానికి చెందిన బాపురెడ్డి మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆధ్వర్యంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో బిజెపిలో చేరడంతో ఆయనకు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు, ప్రచార కార్యక్రమానికి హాజరైన మెదక్ ఎంపీ రఘు నందన్ రావు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలను రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు సత్యనారాయణ గుప్త రామాయంపేట పట్టణ అధ్యక్షుడు అవినాష్ రెడ్డిలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రి ఉన్న సమయంలో ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు ఎంపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవలేదని అన్నారు, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ భూమి విక్రహించి డబ్బులు దోచుకుంటుందని మండిపడ్డారు. రామాయంపేట మున్సిపల్ పట్టణం 1985 నుండి నేటి వరకు అంతే ఉందని ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని మున్సిపల్ ఎన్నికలలో బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే రామాయంపేట బైపాస్ రోడ్డు నుండి దామరచెరువు వరకు డి వైడర్లు ఏర్పాటు చేసి సెంట్రల్ లైటు ఏర్పాటు చేస్తామని వారు అన్నారు, అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ సిద్దిపేట కోమటి చెరువును ఖర్చు చేసి అభివృద్ధి చేశారు రామాయం పేట ను దత్తత తీసుకొని మల్లెచెరువుకు 10 కోట్లు కూడా కేటాయించ లేదని రామాయంపేట ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులను బిఆర్ఎస్ నాయకులు బెదిరింపులకు గురిచేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని, ఇటికతో కొడితే గన్నేటి రౌతుతో కొడతామని, గల్లి నుంచి ఢిల్లీ వరకు తరిమి కొడతామని బెదిరింపులు మానుకోవాలని ఆయన హెచ్చరించారు, గజ్వేల్ సిద్ధిపేట సిరిసిల్ల పై ఉన్న ప్రేమ మెదక్ నియోజకవర్గంపై ఎందుకు లేదని, మండిపడ్డారు, పద్మాదేవేందర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉండి రామాయంపేట ను ఏలాంటి అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్ గౌడ్, బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, వెలుముల సిద్ధిరాములు, రామాయంపేట పట్టణ అధ్యక్షుడు అవినాష్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, అక్కన్నపేట సర్పంచ్ యాదగిరి, లక్ష్మాపూర్ సర్పంచ్ నవీన్ గౌడ్, పబ్బా సత్యనారాయణ గుప్తా, గోపిశెట్టి రమణ గుప్తా, చింతల శేఖర్, బిజెపి బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు.



## బచ్చుగూడలో బీఆర్ఎస్‌కు భారీ ఎదురుదెబ్బ



- కాంగ్రెస్‌లోకి కీలక నేతల చేరిక
- అభివృద్ధే లక్ష్యంగా ముందుకు : కాట శ్రీనివాస్ గౌడ్

**పటాన్ చెరు, ఫిబ్రవరి 05(ప్రజా స్వరం) :**

ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని బచ్చుగూడ 15వ వార్డులో బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సరిత భుజంగా రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఉపసర్పంచ్ జంగారెడ్డి, ప్రముఖ నాయకులు కరుణాకర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, కిష్టారెడ్డి, నవాబ్ గౌడ్, నాగార్జున రెడ్డి తదితరులు తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ పార్టీలో చేరిన నాయకులకు కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బచ్చుగూడ ప్రజలంతా ఐక్యంగా నిలబడి కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి 15వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సరిత భుజంగారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు పరిష్కారం కాని వీధి దీపాల సమస్య, త్రాగునీటి సమస్య, మౌలిక వసతుల కొరత వంటి ప్రజా సమస్యలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బచ్చుగూడ గ్రామ అభివృద్ధి, సంక్షేమం, నిజమైన ప్రజాపాలన కోసం ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు.

# 12వ తేదీ దేశవ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



**జవహర్ నగర్, జనవరి 5, (ప్రజాస్వరం):**

ఈనెల 12వ తేదీన ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని కార్మికుల హక్కులను కాపాడాలని దేశవ్యాప్త చేపట్టే సమ్మె పోస్టర్ గురువారం జవహర్ నగర్ మున్సిపల్ కార్యాలయం వద్ద తెలంగాణ ఆదర్శ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఐ ఎఫ్ టి యు నాయకులు ఆవిష్కరించారు.అనంతరం ఐఎఫ్టియు నాయకుడు పి.శివ బాబు మాట్లాడుతూ..కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని జీవో నెంబర్ 60 అమలు చేయాలని,1919 నాటికి కార్మిక వర్గ హక్కుల మీద పథకం ప్రకారం దాడి మొదలైంది.సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో ఆనాటి పి.వి నర్సింగరావు ప్రభుత్వం "ఏగ్జిట్ పాలసీ"ప్రకటించింది.దీన్ని ప్రకారం నష్టాల పేరుతో యాజమాన్యాలు తమ వ్యాపారాలను,ఉత్పత్తిని ఆపేయవచ్చు.కార్మికులను యథేచ్ఛగా తొలగించవచ్చు.అటల్ బీహారీ వాజపేయి ప్రభుత్వం రెండవ నేషనల్ లేబర్ కమిషన్ను నియమించిందని. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధాని కావడం,బిజెపి పట్టు బిగించడంతో కార్మిక వ్యతిరేక విధానాల అమలు వేగం పుంజుకుందని అన్నారు.29 చట్టాలను రద్దు చేసి కార్మిక వర్గ మెడకు ఉరి తాడు చుట్టిందని మడ్డిపడ్డారు. ఎనిమిది గంటల పని దినం కొనసాగించాలన్నారు. కార్మికులందరూ 12న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు జి.అనురాధ, పిఓడబ్ల్యు జిల్లా నాయకులువి.జయసుధ, జవహర్ నగర్ మున్సిపల్ నాయకులు ఎన్ రాములు,వెంకటమ్మ, రేణుక,ఎల్లేష్ కార్మికులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల భద్రత కోసం హైకోర్టు వద్ద గళమెత్తిన ఐలాపూర్ మాణిక్ యాదవ్

- అడ్వకేట్ స్వప్న కుమారి హత్యకు నిరసనగా ధర్నా

**పటాన్ చెరు, ఫిబ్రవరి 05(ప్రజా స్వరం) :**

న్యాయవాది స్వప్న కుమారి హత్యను తీవ్రంగా ఖండిస్తూ హైకోర్టు వద్ద నిర్వహించిన ధర్నాలో ఐలాపూర్ మాణిక్ యాదవ్ పాల్గొన్నారు. న్యాయవ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న న్యాయవాదులకు భద్రత లేకుండా పోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, న్యాయం కోసం పోరాడే న్యాయవాదులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. స్వప్న కుమారి హత్య కేసులో బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే అసెంబ్లీలో ప్రవేశపెట్టాలి నిందితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ బెయిల్ ఇవ్వకుండా కఠిన శిక్షలు విధించాలని, న్యాయవాదులపై దాడులు చేసే వారిపై నాన్‌బైలబుల్ కేసులు నమోదు చేయాలని, న్యాయవాదుల భద్రతపై ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని అడ్వకేట్ మాణిక్ యాదవ్ డిమాండ్ చేశారు.



# బీజేపీ అభ్యర్థి నాయిని సందీప్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం

**దౌల్తాబాద్, ఫిబ్రవరి 5(ప్రజాస్వరం) :**

ఎన్నికల నేపథ్యంలో గాజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో బీజేపీ పార్టీ అభ్యర్థి నాయిని సందీప్ గెలుపు కోసం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ మండల అధ్యక్షులు లావణ్య నర్సింహా రెడ్డి, ముబారస్పూర్ గ్రామ సర్పంచ్ విజయ స్వామి, వార్డు సభ్యులు మిర్గం రమేష్, మండల ఉపాధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రచార సందర్భంగా నాయకులు ప్రజలను కలిసి దేశ ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి చేస్తున్న సేవలను వివరించారు. పేదలకు ఇళ్ల పథకం, ఉజ్వల గ్యాస్ పథకం, రైతులకు పీఎం కిసాన్, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా, స్వచ్ఛ భారత్, డిజిటల్ ఇండియా వంటి పథకాల ద్వారా కోట్లాది మందికి లబ్ధి చేకూరిందని తెలిపారు. అలాగే దేశ భద్రత, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ గౌరవం పెంచడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, యువత ఉపాధి, మహిళల సాధికారతకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు.



గాజ్వేల్ ప్రజ్ఞాపూర్ ప్రాంత అభివృద్ధికి కూడా బీజేపీ పార్టీ ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అభ్యర్థి నాయిని సందీప్ తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. గురువారం నిర్వహించిన ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని నాయకులు తెలిపారు.



# తూప్రాన్ గీతా విద్యా సంస్థలకు అంతర్జాతీయ అవార్డు

**తూప్రాన్ ఫిబ్రవరి 5 (ప్రజా స్వరం ):**

తూప్రాన్ గీతా విద్యా సంస్థలకు అంతర్జాతీయ స్థాయిలో అవార్డ్ దక్కింది.దుబాయిలో జరిగిన అంతర్జాతీయ విద్యా సదస్సు2026 లో గీతా విద్యా సంస్థల చైర్ పర్సన్ పి. ఉష, డైరెక్టర్ పి.భరత్ లు ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య, సురక్షితమైన వాతావరణం ,అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ,విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రాధాన్యతనిస్తూ అత్యాధునిక మౌలిక సదుపాయాలు ,క్రమశిక్షణ ,నైతిక విలువలు ,సాంకేతికను ఉపయోగించడం మరియు విద్యార్థి తల్లిదండ్రులతో బలమైన అనుబంధం కలిగి ఉండడం అనే ప్రధాన అంశాలను కలిగి ఉన్న విద్యాసంస్థలుగా గీతా విద్యాసంస్థలకు ప్రతిష్టాత్మక గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్ 2026 అవార్డ్ దక్కిందన్నారు. 33 ఏళ్లుగా ఎంతో నిబద్ధతతో విలువ ఆధారిత విద్యను అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు రాఘువేందర్ గౌడ్ , నారాయణ గుప్త, మౌనిక, ప్రిన్సిపాల్ రజనీష్ గౌతమ్ , ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

# ప్రచారంలో దూసుకుపోతున్న ఎనిశెట్టి శ్రీవాణి అశోక్ గుప్త



**రామాయంపేట, ఫిబ్రవరి 5 (ప్రజా స్వరం):**

రామయంపేట మున్సిపల్ పట్టణంలో ఈనెల 11వ తేదీన నిర్వహించే మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ప్రచారాలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి, పదో వార్డుల కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి ఎనిశెట్టి శ్రీవాణి అశోక్ గుప్త ప్రచారంలో దూసుకుపోతున్నారు తనదైన శైలిలో ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు, ఇంటింటికి తిరుగుతూ మహిళలను బొట్టుపెట్టి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాయంపేట మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే 12 వార్డులలో సైతం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని మున్సిపాలిటీ అభివృద్ధి కేవలం కాంగ్రెస్తోనే సాధ్యం అవుతుందని వారన్నారు, గత పది సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే పేదలకు ఎన్నను నిర్మించడం జరిగిందని మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ఇందిరమ్మ ఇండ్ల పథకంతో పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వడం జరుగుతుందని వారు అన్నారు, ఈ కార్యక్రమంలో పదవ వార్డు అభ్యర్థి ఎనిశెట్టి శ్రీవాణి, ఎనిశెట్టి అశోక్ గుప్తా, నిజాంపేట మాజీ ఎంపీపీ సిద్ధిరాములు, నిజాంపేట మండలం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు లింగం గౌడ్, యాద నాగరాజు గుప్తా, చింతల యాదగిరి, స్వామి, తదితరులు పాల్గొన్నారు



# అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- **అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను ఓడించాలి**
- **మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి**

**మెదక్, ఫిబ్రవరి 05 (ప్రజా స్వరం) :**

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మాజీ డిప్యూటీ స్పీకర్,బిఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. గురువారం మెదక్ పట్టణంలోని 5, 7, 8, 9, 10 వార్డుల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు మామిళ్ళ. ఆంజనేయులు, మాయ.అనురాధ శ్రీనివాస్, మాయ.గంగామణి మల్లేశం, జుబేర్ అహ్మద్, వనం. లత వెంకటేష్ లకు మద్దతుగా ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే రెండేళ్లు గడిచిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, అందువల్ల కాంగ్రెస్కు ఈ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేదన్నారు.ఆరు గ్యారెంటీల హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మా అక్క చెల్లెళ్లకు రూ.2,500 జీవన భృతి, పెన్షన్ల పెంపు జరగలేదన్నారు.పంటల సాగుకు కేసీఆర్ హయంలో నిరంతరంగా 24 గంటలు విద్యుత్ సరఫరా చేసామని,ప్రస్తుతం 12 గంటలు కూడా సక్రమంగా రావడం లేదని వివరించారు.కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని చెప్పారు. నేను 25 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా కానీ రెండేళ్లలోనే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఎప్పుడు రాలేదని పేర్కొన్నారు. మెదక్ మున్సిపల్ లో బి ఆర్ ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు, పట్టణ ప్రజలు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం .అంజాగౌడ్ మాజీ ఎంపీపీ కిష్టయ్య, వార్డ్ ఇన్చార్జిలు గట్టయ్య, షాకీర్, ప్రభాకర్, ఎంబిపూర్ మహేష్, రంగారావు, రాజ్ కుమార్, స్వామి, లాలు నాయక్, అంటోని, వినయ్, నాయకులు లింగా రెడ్డి, జైపాల్ రెడ్డి, సోములు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్ 16వ వార్డులో కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం భారీ ర్యాలీ



**తూప్రాన్, ఫిబ్రవరి 5 (ప్రజాస్వరం) :**

తూప్రాన్ మున్సిపాలిటీలోని పదోవ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి కోడిపాక అన్నపూర్ణ నారాయణ గుప్త ఇంటింటి ప్రచారం చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఓటర్లకు వివరించారు పెద్ద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ప్రతి రేషన్ కార్డు ఉన్నా ప్రతి కుటుంబానికి సన్న బియ్యం. 8 కోట్ల తో సీసీ రోడ్లు డ్రైనేజ్ పనులు ప్రారంభం అయ్యాయని ఆమె తెలిపారు మహిళా లకు ఉచిత బస్సు ప్రయాణం కాంగ్రెస్ అమలు చేసిందని ఆమె అన్నారు ఈ కార్యక్రమం లో మహిళలు యువకులు ముస్లిం వృద్ధులు భారీగా పాల్గొన్నారు

# న్యాయవాదిని హత్య చేసిన దుండగులను శిక్షించాలి



- **న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలి**
- **న్యాయవాద సంఘాల డిమాండ్**

**గజ్వేల్ ఫిబ్రవరి 05 (ప్రజాస్వరం) :**

మహిళ న్యాయవాది స్వప్నను అతి దారుణంగా, కిరాతకంగా దాడీ చేసి హత్య చేసిన దుండగలను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని గజ్వేల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు చెన్ రాజ్ పండరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై దాడికి పాల్పడుతూ నడిరోడ్డుపై వారిని దారుణంగా హతమారుస్తున్నా, ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురాకపోవడం పట్ల వారు విచారాన్ని వ్యక్తపరిచారు. ఇకనైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే తీసుకురావాలని వారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కోర్టు విధులను న్యాయవాదులు బహిష్కరించాలని తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. ఈ రోజు గజ్వేల్ కోర్ట్ లో కూడా న్యాయవదులందరు విధులను బహిష్కరించడం జరిగింది.

# డీసీసీ వజ్రేష్ యాదవ్‌పై బీఆర్ఎస్ నేతల ఫైర్



**మేడ్చల్, (ప్రజాస్వరం):**

ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని రాజబొల్లారం 6వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దేశం రాణి నారాయణ గౌడ్ కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని భర్తను కురకుల రమేష్ ను బకరాను చేయడానికి ఎన్నికల బరిలో దింపారని అన్నారు.దీంతో ప్రచారం నిర్వహిస్తున్న పక్కనే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి భర్త కురకుల రమేష్,మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్,మాజీ సర్పంచ్ మండల లక్ష్మీనారాయణ నాయకులు రాజు,పవన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.దీంతో ఇరువురు నాయకుల మధ్య మాటలు యుద్ధం కొనసాగింది.డీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు.మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే రాజాబొల్లారం గ్రామంలో తిరగనీయబోమని వజ్రేష్ యాదవ్ ను హెచ్చరికలు జారీ చేశారు. కౌన్సిలర్ అభ్యర్థి భర్త దేశం నారాయణ గౌడ్ ఏముఖం పెట్టుకొని రాజబొల్లారం గ్రామంలో తిరుగుతున్నాడని ప్రశ్నించారు.

# బీఆర్ఎస్ ప్రచారంలో చిరు వ్యాపారులకు బాసటగా

**తూప్రాన్ ఫిబ్రవరి 5 (ప్రజా స్వరం) :**

తూప్రాన్ మున్సిపాలిటి 14వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి పోతరాజు రచన ధనరాజ్ ఇంటింటి ప్రచారం.... బ్రహ్మరథం పట్టిన వార్డు ఓటర్లు... భారీ మెజారిటీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసిన వార్డు ఇంచార్జ్ మల్కాపూర్ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ధీమా.తూప్రాన్ మున్సిపాలిటీలోని 14వ వార్డులో గురువారం వార్డు ఇన్చార్జ్ మల్కాపూర్ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో అభ్యర్థి పోతరాజు రచనా ధనరాజ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తూప్రాన్ మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధిని ప్రతి ఓటరుకు వివరించారు. అలాగే ప్రతి ఇంటికి కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి హామీలతో గద్దెనెక్కి గతంలో ఉన్న సంక్షేమ పథకాలకు తిలోదకాలు ఇచ్చిందన్నారు.



గడచిన రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి లు బలపరిచిన 14వ వార్డు అభ్యర్థి పోతరాజు రచనా ధనరాజును భారీ మెజారిటీతో గెలిపించాలని వార్డు ఓటర్లను ఇన్చార్జి ఆంజనేయులు గౌడ్ శివంపేట మాజీ ఎంపీపీ హరికృష్ణ లు కోరారు. కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు శ్రీకాంత్, బి ఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య భక్తులే వీఐపీలు

- మహా శివరాత్రి జాతరను విజయవంతం చేయాలి
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



అమీన్‌పూర్, ఫిబ్రవరి 05 (ప్రజా స్వరం ) :

రాష్ట్రంలోనే ప్రసిద్ధ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించనున్న మహా జాతర ఏర్పాట్లపై పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని ఆలయ ప్రాంగణంలో గురువారం ఉదయం నిర్వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి 14 నుంచి 18వ తేదీ వరకు ఐదు రోజుల పాటు మహాశివరాత్రి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సుమారు మూడు లక్షల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉందని తెలిపారు. సామాన్య భక్తులే విఐపిలు అనే భావనతో దర్శన ఏర్పాట్లు చేయాలని, విఐపీ పేరుతో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా క్యూలైన్లు ఏర్పాటు చేసి, రద్దీ నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడపాలని, మూడు రోజులపాటు ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. నిరంతర నిఘా కోసం 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బీరంగూడ గుట్టపై ఉన్న అక్రమణలను 24 గంటల్లోగా తొలగించాలని ఎమ్మార్వో వెంకటేష్‌ను ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతర ఏర్పాట్లపై ఈనెల 12వ తేదీన మరోసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని, అప్పటి లోపు అన్ని పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, తహసిల్దార్ వెంకటేష్, డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, సిఐ నరేష్, ఆలయ ఈవో శశిధర్, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ జాతిపిత.. రేవంత్ బూతు పిత



- గజ్వేల్ ప్రజ్ఞపూర్‌లో మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం లో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్

గజ్వేల్ ఫిబ్రవరి 5 (2026):

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొన్నారు.ఈ సభలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి,ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం,సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు,సభలో హరీష్ రావు మాట్లాడుతూ మనకు అన్నం పెట్టినవాళ్లకు మన కోసం పని చేసినవాళ్లకు ఓటు వేయాలన్నారు, గజ్వేల్ దవాఖాన ఒకప్పుడు పందులతో నిండి ఉండేది కేసీఆర్ హయాంలో అది ఎలా మారిందో ప్రజలకు తెలుసు అన్నారు,రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక బంగారం ధర ఎనబై వేల వరకు పెరిగింది కానీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు,ఉన్న పథకాలను కూడా ఎగ్గొట్టడం తప్ప ప్రజలకు కొత్తగా చేసిందేమీ లేదు అని విమర్శించారు,ఆడవారికి ఉచిత ప్రయాణమని చెప్పి మగవారికి డబుల్ టికెట్ వేశాడు అంటూ ఎద్దేవా చేశారు,మనకు అన్నం పెట్టింది పథకాలు అందించింది కేసీఆర్ రెండేళ్లలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు అని ధీమా వ్యక్తం చేశారు,రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ బూతులు తప్ప ఆయనకు పాలన రాదన్నారు, కేసీఆర్ జై తెలంగాణ అన్నాడు కానీ రేవంత్ రెడ్డి ఒక్క రోజైనా అలా అన్నాడా అని ప్రశ్నించారు,రైతు బంధు అంశంపై మాట్లాడుతూ కరోనా సమయంలో కూడా రైతు బంధు ఆగలేదు,ఇప్పుడు ఎందుకు ఆపారు? ఇప్పటికీ మూడు రైతు బంధు విడతలు ఎగ్గొట్టారు ,ఎన్నికల తర్వాత ఇస్తానంటూ మాటలు చెబుతున్నారు అన్నారు,ఈ విషయంలో ఎన్నికల కమిషన్‌కు లేఖ ఇస్తామని తెలిపారు,ముస్లిం సోదరుల విషయమై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు,గజ్వేల్‌లో ఒక్క తట్టెడు మట్టికూడా ఎత్తలేదు అని వ్యాఖ్యానించారు ,ప్రజ్ఞాపూర్‌లో నిర్మించిన కమిటీ హాల్ ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటున్నారని సున్నం కూడా వేయని పరిస్థితి అని అన్నారు,పోరాడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేస్తోంది,రాష్ట్రం మొత్తం ఆగమైపోయింది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు,బీజేపీపై కూడా విమర్శలు చేస్తూ అక్షింతలు పంచడం తప్ప గజ్వేల్‌కు ఒక్క రూపాయి పని చేశారా అని ప్రశ్నించారు ,గజ్వేల్ బాగుండాలంటే కారు గెలవాలి బీఆర్ఎస్ కౌన్సిలర్లను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను దండం పెట్టి కోరుతున్నాను,మిగిలిన పనుల బాధ్యత నేనే తీసుకుని పూర్తి చేస్తా అని హరీష్ రావు అన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో తండ్రి, కొడుకులు

మెదక్, ఫిబ్రవరి 05 (ప్రజా స్వరం) :

మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ కొడుకు మెదక్ మున్సిపాలిటీ పరిధిలో 31 వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తొడుపునురి రామకృష్ణ పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా తండ్రి, కొడుకులు కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. మెదక్ అభివృద్ధి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చూస్తూ అనేక నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. అధికార పార్టీ కి ఓటు వేస్తే మెదక్ మున్సిపాలిటీ అభివృద్ధి జరుగుతుందని అభివృద్ధి కోసం తమను అవకాశం ఇవ్వాలని కోరారు.



## నేదునూరి పిలుపు..
# ఓ ఓటరు ఓటేయి

* పట్టణ భవిష్యత్తుకు బాటేయి

(తెలంగాణలో పురపాలక ఎన్నికల నేపథ్యంలో పట్టణ ఓటర్ల చైతన్యం కొరకు రాసిన కవిత)

కరీంనగర్/ హైదరాబాద్ (ప్రజా స్వరం):



ఓ ఓటరు ఓటేయి
పట్టణ భవిష్యత్తుకు
బాటేయి

ఫిబ్రవరి 11వ తేదీన
నగర ఓటర్లు పోలింగ్
కేంద్రాలకు పోటెత్తాలి
ఓటర్లలో చైతన్యం
పెరగాలి
ఓటరు వేలిపై పడే సిరాచుక్క
రాబోయే5 ఏళ్లు పట్టణ
భవిష్యత్తును శాసిస్తుంది

నగరాభివృద్ధికి నీ ఓటు
ప్రశ్నించే గళం కావాలి
ఓటు నీతలరాతను మార్చాలి

ఓటరు నీవు వేసే ఓటు
పట్టణ ప్రగతికి
వీధి దీపాల వెలుగుకు
మురికి కాల్వల నిర్వహణ
వార్డు డివిజన్ లో
అంతర్గత రోడ్ల నిర్మాణం
నిర్వహణ మున్సిపాలిటీ
పాలనలో పారదర్శకత
జవాబుదారీతనం
మెరుగైన స్థానిక స్వపరిపాలన
డ్రైనేజ్ గుంతలు లేని రోడ్డు
నిరంతరం మంచినీటి సప్లై
నీ ముంగిట ఉన్న
సమస్యలు తీర్చేసత్తాఉన్న
అభ్యర్థిని ఎంచుకొని ఓటేయి

ఏపార్టీవాడో చూడొద్దు
అభ్యర్థి ఏ పాటివాడో చూడాలి
నిజాయితీ నేరరాహిత్యం
సేవాభావం ఉన్నవారిని
కౌన్సిలర్గా కార్పోరేటర్గా
ఎన్నుకోవాలి

పట్టణంలో మౌలిక సదుపాయాలు
కల్పన ఉపాధినైపుణ్యాభివృద్ధి
డిజిటల్ ఆధునిక సేవలు విద్య
ఆరోగ్యంమురికి కాల్వల గోస

మంచినీటి కష్టాలుతీర్చి పచ్చదనం
పారిశుధ్యం స్వచ్ఛతకు ప్రకృతి
పర్యావరణ రక్షణకు
అంతర్గత రోడ్లు డ్రైనేజీలు
పబ్లిక్ పార్కు ఆరోగ్య సంరక్షణ
వర్షపు నీరు ఇంకుడు
గుంతల ఏర్పాటు

డివిజన్ /వార్డ్ అభివృద్ధికి బడ్జెట్
తీసుకొచ్చే సత్తా ఉన్నఅభ్యర్థికి
ఓటెయి అభివృద్ధికి బాటెయ్యి
పోటీ చేసిన అభ్యర్థి గుణాన్ని
చూసి ఓటెయి

ఐదేళ్లకోసారి వచ్చే పండుగ
నీచేతివేలుపై గీసే చైతన్య గీత
డబ్బుకు మద్యానికి బీరు
బిర్యానికి హామీల ప్యాకేజీకి
నోటుకు ఓటు వేయకు
నీ ఆత్మగౌరవాన్ని అమ్ముకోకు
అభివృద్ధిని అడ్డుకోకు

నీఓటు నగరాన్ని తీర్చిద్దే
వజ్రాయుధం కావాలి
అభివృద్ధిని చూసి ఓటెయి
నిజాయితీగలనేతకే పట్టం కట్టు
పురపాలక ఎన్నికలే పట్టణ
ప్రగతికి మూలం

ఓటు మీకు ఒక వరం దాన్ని
వదులుకోవద్దు
ఓటుమీదైన స్వరం మౌనంగా
ఉండొద్దు
మీపట్టణం మీభవిష్యత్తు కోసం
ఓటు వినియోగించాలి

ప్రజల అవసరాలు ఆకాంక్షలు
సమస్యలు ప్రభుత్వ విధానాల్లో
ప్రతిబింబించాలంటే ఓటు హక్కు
ఉన్నవారు తప్పని సరిగా
ఓటేయ్యాలి

నా ఒక్క ఓటుతో ఏమీ మారదు
అనే నిర్లక్ష్యం వీడండి

ఒక్క ఓటే ప్రభుత్వాలను
తలకిందులు చేసిన సంఘటన
మరవద్దు ఒక్క ఓటుతోనే అటల్
బిహారీ వాజపేయి ప్రభుత్వం
పడిపోయిన సంఘటన ఓటర్లకు
కనువిప్పు కావాలి

కులం మతం డబ్బుకు
లొంగకు ఓటు వేయడం
సామాజిక బాధ్యత
పౌరుడుగా ఓటేయి
ప్రజాస్వామ్య పండుగలో
భాగస్వామివై చైతన్యంతో
ప్రగతి శీలురను ఎన్నుకో

ఏసీ గదుల్లో కూర్చొని కాల
యాపన చేయడం మానండి
పోలింగ్ కేంద్రం వైపు అడుగులు
వేసి మార్పుకు పునాదులు
వేయండి సినిమా షికార్లు వద్దు
ఓటు వేయడమే హద్దు కావాలి
ప్రయాణాలు తీర్థయాత్రలు
మానండి ఉత్తమ అభ్యర్థులను
కాన్సిలర్/ కార్పొరేటర్ గా
ఎన్నుకొని కాలనీ స్థితిగతులు
మార్చండి అభివృద్ధికి
దిక్సూచిగా నిలవండి

పోలింగు రోజు సెలవు రోజని
విశ్రాంతి తీసుకోవద్దు
విద్యావంతులు ఉద్యోగులు
మధ్య తరగతి ఓటర్లు
సంపన్నులు ఉదాసీనతను
వీడాలి ఓటరు గుర్తింపు కార్డుతో
పోలింగ్ కేంద్రాలకు కదలాలి
ప్రలోభాలు వద్దు
నగరభవిష్యత్తే ముద్దు
వివేకంతో ఓటీద్దాం
వికసిత భారత్
సాకారానికిపాటు పడుదాం
పట్టణ ఓటరా నిర్లక్ష్యం వద్దు
ఓటు వేయడమే ముద్దు

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
మాజీ కరెస్పాండెంట్
జస్టిస్ కుమారయ్య లా కాలేజీ
కరీంనగర్
(ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు
చీఫ్ జస్టిస్ జస్టిస్ కుమారయ్య
1969. 1971)
కరీంనగర్
9440245771

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999